క్లుప్తంగా

సువెన్ సహకారం అభినందనీయం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యానికి స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో సువెన్ ఫార్మా కంపెనీ వాటర్ ప్లాంట్ ప్రారంభించడం అభినందనీయమని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సువెన్ ఫార్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మేక నాగేశ్వరరావు, డీఎస్పీ నాగభూషణం, సువేన్ వైస్ ప్రెసిడెంట్ ఆపరేషన్ కేవీ.శేషగిరి రావు, జనరల్ మేనేజర్ మెయింటెన్స్ పీజే.రాయుడు, ఏజీఎం అడ్మినిస్ట్రేషన్ సీహెచ్.వెంకటరెడ్డి, పీఆర్‌ఓ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

తిరుమలగిరి : ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ పెంచుకోవాలని ఆది గురువు భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపిమాధవ్ అన్నారు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై తిరుమలగిరి మండలంలోని మాలిపురంలో ఆది గురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిమాధవ్ మాట్లాడారు. దేశంలో పూర్వకాలంలో ప్రజల జీవన విధానాన్ని, ప్రస్తుత జీవన విధానాన్ని వివరించారు. పంచభూతాలతో చేసేది ప్రకృతి వ్యవసాయం అని అన్నారు. ఆరోగ్యపరంగా ప్రస్తుతం పండిస్తున్న పంటలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శిక్షకులు షేక్ రాము, సునంద, వైద్యుడు నాగభూషణం, రైతులు ఏడుదొడ్ల వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, యాకయ్య, వారాల నరేష్, బిళ్లపాటి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

దురాజ్‌పల్లి : ఇమాంపేట బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకో వాలని సోమవారం పలువురు ప్రజావాణిలో ఫిర్యా దు చేశారు. వైష్ణవి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు అందించిన వారిలో సీఆర్‌పీఎఫ్ జిల్లా క న్వీనర్ జంపాల వెంకటేశ్వర్లు, ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూపతి నారా యణ గౌడ్, సూర్యాపేట జిల్లా మద్దస్ కమిటీ కన్వీ నర్ పులి వినోద, ఎంవీఎఫ్ జిల్లా నాయకురాలు వత్సవాయి లలిత, అలివేలు, సైదులు ఉన్నారు.

వైష్ణవి కుటుంబానికి పరామర్శ



వైష్ణవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

భానుపురి : సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడిన దగ్గుపాటి వైష్ణవి కుటుంబ సభ్యులను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట ధరావత్ వెంకన్న నాయక్, షఫీవుల, గట్టు శ్రీను, వల్లస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు ఉన్నారు.

దోమల నివారణ చర్యలు

అర్వపల్లి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఓ, కోమటిపల్లి గ్రామ ప్రత్యేక అధికారి రావి శశిధర్‌రెడ్డి కోరారు. సోమవారం కోమటిపల్లి గ్రామంలోని వీధులు, కాలువల్లో దోమల నివారణ కోసం మందులు పిచికారీ చేయించారు. నీటి గుంతలలో ఆయిల్‌బాల్స్ వదిలారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పర్వానా, ఏఎన్‌ఎం ఊర్మిళ, ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాములు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మక్కసారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

పెన్‌పహాడ్ : గాజులమల్కాపురం గ్రామంలోని శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకటరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి ధనమ్మరామకృష్ణారెడ్డి, మామిడి వెంకన్న, బండి మధుసూదన్‌రెడ్డి, దొంతగాని గోపయ్య, కుందూరు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గొబ్బి అంజయ్య, డాంగ్యే, బెల్లంకొండ శ్రీరాములు, సైదిరెడ్డి, దేవిరెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆన్‌లైన్‌లో ఎరువుల వివరాలు

- ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్ ఏర్పాటు
- ఎరువులు, విత్తనాల దుకాణాల్లో నిల్వల సమాచారం నమోదు

పెన్‌పహాడ్ : ఎరువుల నిల్వల లెక్కలు పక్కాగా నిర్వహిస్తున్నారు. ఇందు కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎరువుల దుకాణాల్లోని నిల్వల వివరాలను ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇదివరకు ఎరువుల విషయంలో నిల్వల లెక్క పక్కాగా లేకపోవడంతో తరుచూ సమస్యలు తలెత్తేవి. గో డౌన్లలో ఉన్న నిల్వలకు వ్యత్యాసం ఉంటున్నట్లు వ్యవసాయ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఈ సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ శాఖ నూతన సాంకేతికత ఆధారంగా పక్కాగా వ్యవస్థను రూపొందించింది.



అనాజిపురంలోని ఫర్టిలైజర్ షాపులో ఎరువుల నిల్వలను యాప్‌లో నమోదు చేస్తున్న ఏఓ

దుకాణాల్లో అధికారుల పరిశీలన..

పెన్‌పహాడ్ మండలంలోని వ్యవసాయ అధికారులు గత 20రోజుల నుంచే కొత్త యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చారు. ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి సేల్ పాయింట్ల వద్ద ఎరువు నిల్వల వివరాలు, ఫొటోలను ప్రతి సోమ, గురువారాల్లో యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే ఫొటోలను మూడు రోజుల వ్యవధిలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డీఏపీ, యూరియా తదితర ఎరువులు దుకాణాల్లో ఉంటేనే ఎన్ని నిల్వ ఉన్నాయో అక్కడికి వెళ్లి అధికారులు యాప్‌లో ఎంట్రీ చేస్తారు. మండలంలో 12కుపైగా ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. దుకాణాల్లో ఎరువులు నిల్వ ఉన్నాయో లేదో తెలియడానికే కొత్త యాప్‌ను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

రైతుల కోసమే ప్రత్యేక యాప్



ఎరువుల నిల్వలు తెలుసుకోవడానికి కొత్త యాప్‌ను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎరువుల దుకాణాలకు వెళ్లి తనిఖీ చేసి రికార్డుల నమోదును యాప్‌లో ఎంట్రీ చేయడం జరుగుతోంది. దీంతో ఎంత నిల్వలు ఉన్నాయో తెలుసుకోవచ్చు. గ్రామీణ రైతులకు ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తాం.

– బి. కృష్ణసందీప్, మండల వ్యవసాయ అధికారి

సంక్షేమ పథకాలు పేదలకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ భద్రయ్య

సూర్యాపేటటౌన్ : భారతదేశంలో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్, రిటైర్డ్ తహసీల్దార్ భద్రయ్య, కో కన్వీనర్ రేపాక లింగయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పన్నుల భారాన్ని ధనవంతులపై మాత్రమే మోపాల్సి ఉంటుందని అన్నారు. కానీ జీఎస్టీ రూపంలో పేదల నుంచే ఎక్కువ పన్నులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ధనవంతులకు, మధ్య తరగతి వారికి చేరినంతగా పేదలకు చేరడం లేదన్నారు. పాత రేషన్‌కార్డులను మొత్తం ప్రక్షాళన చేసి బోగస్ కార్డులు ఏరివేయాలని కోరారు. ఆధార్ కార్డులతో ఆస్తులను, బ్యాంక్ అకౌంట్‌లను, పాన్ కార్డులను అనుసంధానం చేయాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రంగారెడ్డి, ఆవుల నాగరాజు, అబ్దుల్ కరీం, దాసరి రాములు, నారబోయిన వెంకట్ యాదవ్, చామకూరి నర్సయ్య, రమనక్క, యోగానంద్, సీహెచ్.వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నించినందుకే బహిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌రెడ్డి, పాల్గొన్న కౌన్సిలర్లు

భానుపురి : సూర్యాపేట మున్సిపాలిటీలో అభివృద్ధి మాటున జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకే తనను పార్టీ నుంచి బహిష్కరించారని 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల భర్త దిలీప్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ బహిష్కరించిన కొండపల్లి దిలీప్ రెడ్డి, కౌన్సిలర్ నిఖిలకు మద్దతుగా 15 మంది బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో కష్టపడి పనిచేసే వారికి విలువ లేదన్నారు. అవినీతిని ప్రశ్నిస్తే పార్టీ నుంచి బహిష్కరిస్తారా..? పదేళ్ల నుంచి పని చేసిన మాకు మీరు ఇచ్చే గౌరవం ఇదా అని ప్రశ్నించారు. కనీసం వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలపై కౌన్సిలర్ల పేరు పెట్టేందుకు కూడా అంగీకరించలేదన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణకు తమను బహిష్కరించేందుకు సంతకం చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. మేమంతా కలిసికట్టుగా ఉంటామని, భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు బచ్చలకూరి శ్రీనివాస్, జహీర్, ఎలిమినేటి అభినయ్, అన్నేపర్తి రాజేష్, అనంతుల యాదగిరి, రాపర్తి శ్రీనివాస్, మామిడి గౌరయ్య, జ్యోతి కరుణాకర్, రవి నాయక్, నాయకులు గండూరి రమేష్, లింగా నాయక్, సిరివెళ్ల శబరి, కుంభం రాజేందర్, మకట్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్ అభ్యర్థులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : పాఠశాలల్లో ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని ఆర్ట్, క్రాఫ్ట్ అభ్యర్థులు సోమవారం సూర్యాపేటలో జరిగిన గ్రీవెన్స్‌డేలో అదనపు కలెక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 30ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్ట్, క్రాఫ్ట్ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. గురుకులాల్లో, జెడ్పీహెచ్‌ఎస్‌లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, ఎల్లయ్య, రాణి, లక్ష్మి, కల్పన, ఉమ, స్వరూప, నాగమణి, సంధ్యారాణి, రమ, ఉమారాణి, సుజాత పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

తిరుమలగిరి : ఫిబ్రవరి 15న జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని లంబాడీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు భూక్యా పరదేశ్ నాయక్ కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల అధ్యక్షుడు జహిందర్‌నాయక్, రాజు, శ్రీను, వీరన్న, నరేష్ పాల్గొన్నారు.

ఆలయ పాలకవర్గ నియామకానికి నోటిఫికేషన్

అర్వపల్లి : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ పాలకవర్గ నియామకానికి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి 20 రోజుల్లోపు పాలకవర్గానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని దేవాదాయశాఖ ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి వై . శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి. శ్రీనివాసరెడ్డి కోరారు. దేవాలయానికి ఎక్స్ అఫిషియో సభ్యుడు కాకుండా ఏడుగురు ధర్మకర్తలు ఉంటారని తెలిపారు. ఈ ఏ డుగురు సభ్యులలో ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ మహిళ ఉండాలని సూచించారు. దరఖాస్తులను నల్లగొండలోని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఏడుగురు ధర్మకర్తలలో ఒకరిని దేవస్థాన చైర్మన్‌గా ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. ఇదిలా ఉంటే ఈనెల 20 నుంచి మార్చి 8 వరకు దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలు ముగిశాకే పాలవకర్గ నియామకం జరిగే అవకాశం ఉంది.

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె



భానుపురి : సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు



నూతనకల్‌లో న్యూడెమోక్రసీ నాయకుల ర్యాలీ

భానుపురి : ఈ నెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు వెంబడి గురుజీ అన్నారు. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శి బీవీ రాహుల్‌కు దాడువాయి, హమాలీ స్వీపర్, డబ్బా కార్మికుల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కార్మికులను షెడ్యూల్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్, ఎలుగూరి శ్రీనివాస్, పొదిళ్ల లింగస్వామి, వెంకటరత్నం, శ్రీనివాస్, రాఘవులు, శంభు లింగం, వెంకన్న, మధు కుమార్, లింగా నాయక్, శారద, ఉపేందర్, విజయమ్మ, పద్మ పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

ఆత్మకూరు (ఎస్) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐకేఎస్ జిల్లా నాయకుడు పోరెల్ల దశరథ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డేగల వెంకటకృష్ణ, గుణగంటి శ్రీను, నీలమ్మ, రవీందర్, జంపాల మల్లయ్య, సుధాకర్, రహీం, ఎల్లన్న, సాగర్, వెంకన్న, మల్లయ్య, ఆంజనేయులు, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని డి.కొత్తపల్లిలో సీపీఐ(ఎంఎల్), అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలో వ్యవసాయ రంగం, కార్మిక రంగం తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌కుమార్, యానాల సుధాకర్‌రెడ్డి, బయ్య లింగయ్య, ఎస్‌డీ బాడేమియా, నాతి ఉప్పలయ్య, కసం వీరయ్య, కడారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

రాముడి పేరుతో రాజకీయం..

నూతనకల్ : బీజేపీ నాయకులు రాముడి పేరుతో రాజకీయాలు చేస్తూ లబ్ధిపొందాలని చేస్తున్న కుట్రలను ప్రజాస్వామ్యవాదులు తిప్పికొట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. డేవిడ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ బంద్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, పెద్దింటి రంగారెడ్డి, పోలెబోయిన కిరణ్‌కుమార్, దేసోజు మధు, మున్నా అశోక్, దగ్గుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగారం : డి.కొత్తపల్లిలో బైక్‌ర్యాలీ..



ఆత్మకూర్ (ఎస్) : మాట్లాడుతున్న నాయకులు

బీఆర్‌ఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

తుంగతుర్తి : కృష్ణా జలాల హక్కుల సాధనకై మంగళవారం నల్లగొండలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. సోమవారం మండల పరిధిలోని బండరామారంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో వీరబోయిన రమేష్, పులుసు ఉప్పలయ్య, ఆకారపు భాస్కర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కేంద్రం నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు మంగళవారం నల్లగొండలో జరిగే కేసీఆర్ సభ విజయవంతానికై సోమవారం అర్వపల్లిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ మాట్లాడారు. నల్లగొండ సభకు రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, మండల నాయకుడు బైరబోయిన రామలింగయ్య, పందిరి యుగంధర్, మార్కెట్ డైరెక్టర్ అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాచకొండ గీతాసురేష్, దుబ్బాక ఎల్లంరాజు, పులిచర్ల ప్రభాకర్, వెంకన్న, గోసుల విజయ్, రవీందర్, నర్సయ్య, శైలేందర్, తిరుమల్ పాల్గొన్నారు.



అర్వపల్లి : మాట్లాడుతున్న సోమేష్‌గౌడ్



తుంగతుర్తి : మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

కిషోర్‌కు సీఎంను విమర్శించే స్థాయిలేదు



తిరుమలగిరి : మాట్లాడుతున్న నాయకులు

తిరుమలగిరి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి తుంగతుర్తి మాజీ శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే నివాస గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 60 రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన రెండు హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. మరికొద్ది రోజుల్లో మరో రెండు హామీలు అమలవుతాయని తెలిపారు. గాదరి కిషోర్‌కుమార్ తుంగతుర్తి నియోజకవర్గంలో అరాచక పాలన సాగించాడని ఆరోపించారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్, సంకెపల్లి కొండల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, సుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, తిరుమని యాదగిరి, అబ్బాస్, సుధాకర్, దిలీప్, రాము గౌడ్, సజ్జన్, కె.శ్రీను, బాలకృష్ణ, నాగేంద్రాచారి, విజయ్, మోహన్ పాల్గొన్నారు.

మద్దిరాల : అధికారం కోల్పోవడంతో మతిస్థిమితం కోల్పోయిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఏమి మాట్లాడుతున్నాడో తనకే అర్థం కావడం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని ల్యాండ్, ఇసుక మాఫియాకు అడ్డాగా మార్చిన మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కు సీఎం రేవంతర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను విమర్శించే స్థాయి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పచ్చిపాల వెంకన్న, మాన్‌సింగ్, మామునూరి ఉపేందర్, అండెం మల్లయ్య, సీతరాములు, పొన్నం వెంకన్న, చెన్ను, చిరంజీవి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఐఈఓ జానపాటి కృష్ణయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ సత్యంబాబు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల బంద్‌కు పిలుపు

భానుపురి : కార్పెంటర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సూర్యాపేట అధ్యక్షుడు బైరోజు లింగాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కంపెనీలతోపాటు ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తి పెరగడంతో పనులు దొరక్క కార్పెంటర్ల జీవనోపాధి అగమ్య గోచరంగా మారిందని తెలిపారు. కార్పెంటర్ల సమస్య పరిష్కారం అయ్యేవరకు నిరవధిక బంద్ నిర్వహిస్తున్నందున కార్పెంటర్ అనుబంధ వృత్తుల వారు సహకరించాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరణ

అర్వపల్లి : గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఏఈవాస శ్రీకాంత్ తెలిపారు. సోమవారం అర్వపల్లిలో విద్యుత్ సిబ్బందితో కలిసి వినియోగదారుల నుంచి ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నంబర్లను సేకరించారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అర్హులైన వారంతా వెంటనే తమ పేర్లు, వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ రాజేష్, జేఎల్‌ఎం గంగరాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి మండలంలో వివరాల సేకరణ

తుంగతుర్తి : 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కోసం సోమవారం మండల కేంద్రంలో విద్యుత్ అధికారులు వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈఈ శ్రీనివాస్ మాట్లాడారు. విద్యుత్ మీటర్ కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదు, రేషన్‌కార్డు వివరాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్వపల్లిలో విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న ఏఈ శ్రీకాంత్

నాగారం ఎస్‌ఐగా వెంకట్‌రెడ్డి



నాగారం : నాగారం మండల ఎస్‌ఐగా వెంకట్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నాగారం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎర్ర సైదులుగౌడ్ ఇటీవల బదిలీపై ఆత్మకూర్(ఎస్) మండలానికి వెళ్లగా ఆయన స్థానంలో గరిడేపల్లి ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి నాగారం ఎస్‌ఐగా నియమితులయ్యారు.

నూతన కమిటీ ఎన్నిక

నాగారం : యూత్ కాంగ్రెస్ నాగారంబంగ్లా నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ వసతి గృహంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడ్డేటి సురేష్, ప్రధాన కార్యదర్శిగా కన్నెబోయిన హరీష్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె.అశ్వక్, బయ్య సంతోష్, కార్యదర్శిగా ఎస్‌కె.అబ్దుల్ లతీఫ్, సహాయ కార్యదర్శిగా బుర్రి రమేష్‌రెడ్డి, కోశాధికారిగా శ్యామల నరేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నాగరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమన్న, బయ్యం వెంకన్న, కన్నెబోయిన రాంమూర్తి అంజయ్య, సంజీవరెడ్డి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పెన్‌పహాడ్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. పెన్‌పహాడ్, మద్దిరాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామానికి చెందిన బహురోజు జనార్దనచారి బైక్‌పై గరిడేపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దురాజ్‌పల్లి వద్ద పెన్‌పహాడ్ మండల పరిధిలోని గాజులమల్కాపురానికి చెందిన రమాదేవి లిఫ్ట్ అడగగా ఎక్కించుకుని వస్తున్నాడు. మార్గమధ్యలో సింగారెడ్డిపాలెం గ్రామ శివారులోని చెరువు కట్ట వద్దకు రాగానే మండలంలోని చిన సీతారాంతండాకు చెందిన బాణోతు శ్రీను ఆటో ఎదురుగా ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో బైక్‌పై వెళ్తున్న జనార్దనచారి, రమాదేవికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని..

మద్దిరాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షేక్ ఖాసీం మదిరాల మండల కేంద్రానికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మండల కేంద్రంలో పనికోసం వెళ్తున్న ఖాసీంను దంతాలపల్లి నుంచి పిడుగురాళ్ల వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక యువకులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

మద్దిరాల : నూతనకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ కోశాధికారి బందు కృష్ణయ్య జన్మదిన వేడుకలను సోమవారం పోలుమల్ల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ నాగుల్ మీరా, ఏలేటి నారాయణరెడ్డి, ఇమ్మడి రాజబహద్దూర్‌రెడ్డి, కోన గంగరాజు, పందిరి రవీందర్‌రెడ్డిపాల్గొన్నారు.



దాతలు అందించిన పరీక్ష ప్యాడ్‌లతో విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు అల్పాహారం అందజేత

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం దాతల సహకారంతో అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ మాట్లాడారు. దాతలు డి.వశిష్ఠ, ఎండీ.ఆదిల్, మొగుళ్ల యాదగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

నూతనకల్ : బీజేపీతోనే దేశం ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచనపల్లిలో నిర్వహించిన గావ్ ఛలో – బస్తీ ఛలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ గత పది సంవత్సరాల నుంచి దేశంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొల్క కుమార్, బ్రహ్మాండ్లపల్లి మధు, బోయిని శ్రీనివాస్, వాంకుడోతు కోటేష్, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఆత్మకూరు (ఎస్) : వాహనదారులు పోలీసులు సూచించే ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్‌ఐ సైదులు గౌడ్ అన్నారు. రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వాహనదారులకు పోలీస్ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.